దశాబ్దాల కల..
నెరవేరనున్న వేళ

- జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీస్ వరకు రోడ్డు విస్తరణ
- రూ.12.5 కోట్లతో 2.1 కిలోమీటర్ల మేర పనులు
- శిలాఫలకం ఆవిష్కరించిన మేయర్, ఎమ్మెల్యే


ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్ : దశాబ్దాల నాటి కల నెరవేరబోతోంది. నిత్యం రద్దీగా.. ట్రాఫిక్‌తో సతమతమవుతున్న పాతనగర వాసులకు ఉపశమనం కలగనుంది. రోడ్డు విస్తరణతో పాతనగరం కాస్త కొత్త నగరంగా మారనుంది.

రూ.12.5 కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు మేయర్ శ్రీకారం..

నగర రద్దీని దృష్టిలో పెట్టుకుని రోడ్లు విస్తరించనున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జోన్–4 పరిధిలోని జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీస్ వరకు పూర్ణామార్కెట్ వద్ద రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సుమారు రూ.12.5 కోట్లతో 2.1 కిలో మీటర్ల మేర 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులకు భూమిపూజ చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విశాఖ నగరాన్ని పరిపాలన రాజధానిగా ప్రకటించి ఆ దిశగా అడుగులు వేస్తున్నందున రద్దీని తగ్గించేందుకు విస్తరణ అవసరమని తెలిపారు. పూర్ణామార్కెట్ రోడ్డు ఎన్నో వాణిజ్య సముదాయాలకు నిలయమని, రోడ్డు విస్తరణ చాలా అవసరం అన్నారు. ఈ విస్తరణతో జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు రద్దీని తగ్గించుకోగలమని తెలిపారు.

విశాఖ ఎంతో అభివృద్ధి చెందుతుంది..

ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో విశాఖ నగరం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి ఏక కాలంలో అమలు చేస్తున్న ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, కోడూరు అప్పలరత్నం, బిపిన్‌కుమార్ జైన్, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, జోనల్ కమిషనర్ శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజినీరు సంతోషి, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన


34వ వార్డులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : జీవీఎంసీ 34వ వార్డు అచ్చియ్యమ్మపేట, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అధికారులతో మాట్లాడి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, జేసీఎస్ అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్, కర్రి నీలకంఠం, వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీనివాసరావు, బోణి దేవ, దూడ అప్పారావు, వాసుపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

36వ వార్డులో..

ముస్లింల సమస్యల పరిష్కారానికి ఏవీఎన్ కాలేజీ దరి జామియా మసీదు వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో 36వ వార్డు అధ్యక్షుడు మాణిక్యాలరావు, నొల్లు పోతుస్వామి, శంకాభక్తుల సన్యాసిరావు, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోణి దేవ, వద్దాది దిలీప్, వెంకటలక్ష్మి, దశమంతుల చిన్ని, సాగర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మన్యుసూక్త హోమం


ఆంజనేయ స్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట : మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో భాద్రపద పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. ప్రతి నెల పౌర్ణమి రోజున స్వామి వారికి హోమం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. హోమం వల్ల నర ఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి లభిస్తుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ హోమం నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముఖ్య సలహాదారుల ఎంపిక


సమావేశంలో పాల్గొన్న ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు

అల్లిపురం : మిసెస్ ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ముఖ్య సలహాదారులుగా ఎమ్మెల్యే గణబాబు, సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు, ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వద్దాది కృష్ణమోహన్ నియమితులయ్యారు. నగరంలో మరో ముగ్గురు ప్రముఖులను సంఘం సలహాదారులుగా కార్యవర్గం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు సమావేశమయ్యారు. అలాగే పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ డాక్టర్ ఇమంది శంకర్రావు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, వ్యాపారవేత్త కంకటాల మల్లిక్‌లను సలహాదారులుగా నియమించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. 2035 నాటికి కళాశాల ఏర్పడి 175 ఏళ్లు అవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. కళాశాల కరస్పాండెంట్ ఏవీ భానోజీరావు, అధ్యక్షుడు అజ్జరపు సర్వేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు, విశ్రాంత జడ్జి ఎం.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, ఎస్.రామస్వామి, డాక్టర్ గోపీచంద్, శేఖరమంత్రి ప్రభాకర్, మల్లిక్, తలశిల శ్రీనివాస్, వాసిరెడ్డి శ్రీనివాస్, జి.సువర్ణ, టి.ఎల్.ఎస్.భారతి, ఎస్.నాగేశ్వరరావు, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్లు అందిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ అర్షద్

సీతమ్మధార : ఆయుష్ ట్రైనింగ్ డివిజన్ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శుక్రవారం ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ ఇమేతి యాజ్ అర్షద్, నెహ్రూ యువ జన కేంద్రం జిల్లా యువజన అధికారి జి.మహేశ్వరరావు పాల్గొని మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఆయుష్ ట్రైనింగ్ డివిజన్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ పి.హిమబిందు, ఆచార్య సొమ్యానందస్వామిజీ, డాక్టర్ ఎ.రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బు చికిత్సల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : గుండె జబ్బు చికిత్సల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం కేజీహెచ్ కార్డియాలజీ విభాగంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. స్టెమీ ప్రాజెక్టు కింద గుండె నొప్పి వచ్చిన వారికి సుమారు రూ. 40 వేల ఇంజక్షన్ ఉచితంగా ఇస్తున్నారని, దీనిపై రోగులకు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ వాణి, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆదిలక్ష్మి, ప్రొఫెసర్ మల్లాది శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ హేమమాలిని, ఏడీ శ్రీనివాస్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిఫా వైరస్‌పై అప్రమత్తం

కేజీహెచ్‌లో 30 పడకలు సిద్ధం

మహారాణిపేట: నిఫా వైరస్ రోగుల కోసం కేజీహెచ్‌లో 30 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. కేజీహెచ్ ఓపీ మేడ మీద ఐసోలేషన్ వార్డులో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఈ వార్డుకు ఏసీ, వెంటిలేటర్, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ వార్డుకు జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ పి.రాధాకృష్ణ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే అనేక మంది నుంచి రక్త పరీక్షలు స్వీకరించామని, శాంపిల్స్‌ను ముంబాయి పంపినట్టు తెలిపారు.

అందరికీ ఆరోగ్యం.. సీఎం జగన్ ధ్యేయం


జగనన్న ఆరోగ్య సురక్ష పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ నారాయణరావు


వేంకటేశ్వరమెట్ట–1లో గృహసారథులతో జేసీజే ఇన్‌చార్జ్ శ్రీధర్, రంధి గోపి తదితరులు

మహారాణిపేట : జీవీఎంసీ 29వ వార్డు వెంకటపతిరాజు నగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది, వలంటీర్లు గడప గడపకు వెళ్లి ప్రజలకు అవగాహన కలిగించారు. వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనేదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. ఇంటి వద్దకే వైద్యులు వచ్చి పరీక్షలు చేసి, వైద్యం అందించే ప్రక్రియ ఇప్పటి వరకు ఎవరూ చేయలేదన్నారు. ఇది సరికొత్త అధ్యాయం అన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి మన దేశంలో ఎక్కడా లేరని, మనందరం మరోసారి జగనన్నను సీఎంగా ఎన్నుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, వలంటీర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో..

అల్లిపురం : రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని జేసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 33వ వార్డు పరిధి వేంకటేశ్వరమెట్ట–1, 2, కుమ్మరవీధి, ఉడ్‌యార్డు స్ట్రీట్, గౌరీవీధి సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్యంతో పాటు పార్టీ కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించే విధంగా జేసీఎస్ ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యకర్తలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. అక్టోబర్ 19వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అంతకు ముందు శనివారం ఏఎన్ఎం, ఆశ వర్కర్లు గడప గడపను సందర్శించి రక్త పరీక్షలు చేస్తారన్నారు. సమస్య ఉన్నవారిని 19వ తేదీన జరిగే వైద్య శిబిరానికి తరలించి చికిత్స అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, ఏఎన్ఎం తులసి, నీలాపు అయ్యప్పరెడ్డి, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయంలో పౌర్ణమి పూజలు


సామూహిక వ్రతంలో పాల్గొన్న దంపతులు

దాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ(బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. భాద్రపద పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువ జాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు. సాయంత్రం వరకు భక్తుల తాకిడి కనిపించింది. వేకువజాము 4 గంటలకు అనివెట్టి మండపం వద్ద సామూహిక వ్రతాలు, ప్రత్యేక పూజలు, ధ్వజస్తంభ పూజలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.

మహిళా కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్


లావణ్యను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి జె. లావణ్యకు ఏయూ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి, పలువురు అధ్యాపకులు లావణ్యకు అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణ వ్యవస్థలోని మొక్కల నుంచి జీవ ఉపయోగకర బాక్టీరియాను వేరు చేసి పరీక్షించుట అనే అంశంపై ప్రొఫెసర్ డి. సంధ్యాదీపిక నేతృత్వంలో పరిశోధన చేశారన్నారు. ఆత్మీయ సభలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం


సీతమ్మధార: బాలల హక్కుల పరిరక్షణ నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ అన్నారు. ఇటీవల నగర సీపీగా బాధ్యతలు చేపట్టిన ఆయనను చాంబర్‌లో శుక్రవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కమిషనర్‌తో ఆయన భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు. బాలల భిక్షాటన, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, వివిధ పిల్లల కేసులు, కారణాలు, ప్రభావిత అంశాల గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, భద్రతను దృష్టిలో ఉంచుకొని నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామన్నారు. బాలల స్నేహపూర్వక స్టేషన్లుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలతో అడుగులు వేస్తామని చెప్పారు. పోలీస్ అధికారులను సమన్వయ పరిచి, పిల్లలకు సంబంధించి అన్ని అంశాల పరిష్కారానికి సమావేశాలను ఏర్పాటు చేస్తామన్నారు. గొండు సీతారాం మాట్లాడుతూ వివిధ అంశాల పరిష్కారం దిశగా సీపీతో భేటీలో చర్చకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొబెషనరీ ఆఫీసర్ ఎం.శరత్ పాల్గొన్నారు.

దిక్కు లేని వృద్ధులకు ఆశ్రయం


ఏయూటీడీ ప్రతినిధి జ్యోతిర్మయికి పైడితల్లిని అప్పగిస్తున్న పట్నాయక్

అల్లిపురం : కన్నవారి ఆదరణకు నోచుకోని వృద్ధులకు జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం నిర్వాహకులు అండగా నిలుస్తున్నారు. వసతి గృహం ప్రతినిధి ప్రగడ వాసు, మేనేజర్ జ్యోతిర్మయి తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా, రాజాం మండలం, ఉద్వాల్ గ్రామానికి చెందిన సిరిసెట్టి పైడితల్లి కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైంది. ఆగస్టు 28వ తేదీన సమాజ సేవకుడు పట్నాయక్ ఇచ్చిన సమాచారం మేరకు శివాజీపాలెం రోడ్డుపై ఉంటున్న పైడితల్లిని ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్ షెల్టర్ సిబ్బందికి అప్పగించారు. అప్పటి నుంచి ఆశ్రయం పొందుతున్న ఆమెకు శుక్రవారం మదర్ థెరిసా ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. అదే విధంగా ఒడిశా రాష్ట్రానికి చెందిన రేఖ అనే వృద్ధురాలు ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురు రోడ్డుపై తిరుగుతుండగా జూన్ 23వ తేదీన టీఎస్ఆర్ కాంప్లెక్స్, ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి అప్పగించారు. ఆమెకు చికిత్స అందజేసిన ఏయూటీడీ ప్రతినిధులు ఆమె ఆరోగ్యం మెరుగుపడటంతో ఆమెను కూడా మదర్ థెరిసా ఆశ్రమానికి అప్పగించినట్లు తెలిపారు.

వినాయక చవితికి ఎమ్మెల్యే విరాళాల అందజేత


విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : నియోజకవర్గంలో వరసిద్ధి వినాయక చవితి వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఉత్సవాలకు, అన్నసమారాధనలకు విస్తృతంగా విరాళాలు అందజేశారు. 37వ వార్డు పెయిందొరపేటలో వినాయక ఉత్సవాలకు రూ.3 వేలు, బుక్కావీధిలో రూ.5 వేలు, థాంసన్ స్ట్రీట్‌లో రూ.3 వేలు, 35వ వార్డులో రూ.3 వేలు, మరో రూ.5 వేలు స్వయంగా వినాయక మండపాలకు వెళ్లి స్వామిని దర్శించుకుని, పూజలు చేసి అందజేశారు.

ప్రత్యేక పూజలు.. అన్నసమారాధనలు


దుర్గాలమ్మ ఆలయంలో అన్నప్రసాదం వడ్డిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి తదితరులు


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టపై డీజే బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శుక్రవారం వినాయక మండపం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కోరిబిల్లి త్రినాథ్ పాల్గొని అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు వెయ్యి మందికి జరిగిన అన్నసమారాధనలో సూరిశెట్టి శ్రీను, కార్తీక్, దిలీప్, గొంతిన వెంకటేష్,దినేష్, సిద్ధు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు..

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి అల్లూరి వీధిలో బాల గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం గణేష్ మండపంలో కుంకుమ పూజలు చేశారు. ఉదయం భక్తుల గోత్ర నామాలతో పూజలు జరిగాయి. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

జ్ఞానాపురంలో అన్నసమారాధన..

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో సిద్ధి వినాయక మహోత్సవాలను పురస్కరించుకుని ఫ్రెండ్లీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ ప్రారంభించారు. సుమారు 2 వేల మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అన్నసమారాధనకు కార్పొరేటర్ పూర్ణిమ సొంత నిధులు అందించడంతో నిర్వాహకులు సత్కరించారు.

పలు వార్డుల్లో..

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 31వ వార్డు సింగ్ హోటల్ జంక్షన్ వద్ద ఓంకార్ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బత్తిన నాగరాజు పాల్గొని అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

29వ వార్డులో..


జీవీఎంసీ 29వ వార్డు ఆంథోనీనగర్‌లో వర చింతామణి గణపతి ఆలయంలో విజయలక్ష్మి ఆధ్వర్యంలో పసుపు దంచు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు. రామజోగిపేట, అంగటిదిబ్బ ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాల్లో మన్యాలతో పాటు స్థానిక మహిళలు, యూత్ బాయ్స్ పాల్గొన్నారు.


దుర్గాలమ్మ ఆశీస్సులు ప్రజలపై ఉండాలి..

దుర్గాలమ్మ ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దంపతులు దుర్గమ్మను కోరుకున్నారు. పూర్ణామార్కెట్ వెలంపేట దుర్గాలమ్మ ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మేయర్ పాల్గొని అన్నదానం చేశారు. కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


గణపతికి దీపారాధన..

జీవీఎంసీ 29వ వార్డు పరిధి మహారాణిపేటలో దిబ్బలపాలెం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయకచవితి వేడుకల్లో శుక్రవారం దీపారాధన, కుంకుమ పూజ నిర్వహించారు. స్థానికంగా ఉన్న మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలు వెలిగించారు.


అన్నప్రసాదం వడ్డిస్తున్న శ్రీధర్ తదితరులు


అన్నప్రసాదం వడ్డిస్తున్న బొడ్డేటి ప్రసాద్, కోరిబిల్లి త్రినాథ్ తదితరులు

ఆర్టీసీ పార్సిల్ సర్వీస్‌ను వినియోగించుకోండి


పార్సిల్ కౌంటర్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు

అల్లిపురం: ఆర్టీసీ పార్సిల్ సర్వీస్‌ను అందరూ వినియోగించుకోవాలని ఆర్టీసీ జోన్–1 డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు కోరారు. మద్దిలపాలెం పార్సిల్ కౌంటర్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. బస్సుల రాకపోకల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్సిల్ బుకింగ్స్‌పై ఆరా తీశారు. ఆయన వెంట ఏటీఎం రాజు, సిబ్బంది, సూపర్‌వైజర్స్, కంట్రోలర్స్ పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల సమ్మె విజయవంతం

సీతమ్మధార : క్లాప్ డ్రైవర్ల సమ్మె విజయవంతమైన సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. క్లాప్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ క్లాప్ డ్రైవర్ల సమస్యపై జీవీఎంసీ అధికారులతో పాటు కాంట్రాక్టర్‌తో చర్చలు జరిగాయన్నారు. చర్చలు ఫలించడంతో యాధివిధిగా విధుల్లో చేరారని అన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ రికవరీ పోగా నికర జీతం 13,100 ఇవ్వడానికి, యాక్సిడెంట్లలో యజమానే బాధ్యత వహించడానికి ఒప్పందం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఏడీసీవీ.సన్యాసిరావుకు, కాంట్రాక్టర్ సునీల్‌రెడ్డికి యూనియన్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. విశాఖ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రాజు, అధ్యక్షుడు టి.నూకరాజు పాల్గొన్నారు.

జోరుగా జర్నలిస్టుల సభ్యత్వ నమోదు


దరఖాస్తులు స్వీకరిస్తున్న సొసైటీ ప్రతినిధులు సత్యనారాయణ, రవికాంత్

అల్లిపురం : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు ఏర్పడిన అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రెండవ రోజు చురుగ్గా కొనసాగింది. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో 250 మంది వరకు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ గౌరవాధ్యక్షుడు జి.జనార్దనరావు, అధ్యక్షుడు బి.రవికాంత్ మాట్లాడుతూ జర్నలిస్టుల స్థలాల సాధనకు ఐక్యంగా కృషి చేస్తున్నామన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ అక్టోబరు 1వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందన్నారు. దరఖాస్తుదారులు అక్రిడేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో దరఖాస్తు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సలహాదారు పి.సత్యనారాయణ, డి.రవికుమార్, కోశాధికారి ఎ.శరత్‌కుమార్, ఉపాధ్యక్షుడు కె.పరశురామ్, పి.రామకృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి బి.రమేష్, సహాయ కార్యదర్శులు ఎస్.అనురాధ, బందరు శివ, ప్రసాద్, చందు, రాజా, కోటి తదితరులు పాల్గొన్నారు.